క్లుప్తంగా

జీతాలు చెల్లించాలి..


నిరసన తెలియజేస్తున్న పారిశుధ్య కార్మికులు

విజయనగరం ఫోర్ట్: జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, రెండు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అశోక్, సన్యాసమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. .

చెల్లూరులో కాలువ నిర్మాణం


బీసీ కాలనీలో కాలువ నిర్మాణ పనులు

విజయనగరం రూరల్: మండలంలోని చెల్లూరు బీసీ కాలనీలో మండల పరిషత్ నిధులతో కాలువ నిర్మాణ పనులు చకాచకా జరుగుతున్నాయి. గత ప్రభుత్వాలు బీసీ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనను గాలికొదిలేయడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుత పాలకులు రూ. 2 లక్షలు మంజూరు చేయడంతో కాలువ పనులు చేపడుతున్నారు.

మిల్లర్ల అక్రమాలు అరికట్టాలి..


కలెక్టరేట్ ఎదుట నిరసనలో ఏపీ రైతు సంఘ సభ్యులు

విజయనగరం అర్బన్: జిల్లాలో ధాన్యం కొనుగోలు వ్యవహారంలో మిల్లర్ల అక్రమాలను అరికట్టాలని ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి బి.రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిల్లర్లు రైతుల నుంచి క్వింటాకు 5 నుంచి 10 కిలోల ధాన్యం అక్రమంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. సంబంధిత శాఖాధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం స్పందనలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం, జిల్లా ఉపాధ్యక్షుడు లోకావరపు ఆదినారాయణమూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి సిరికి శ్రీరామ్మూర్తి, ఈదుబిల్లి అప్పారావు, సిరికి చంద్రరావు, జిల్లా కమిటీ సభ్యులు శిరవరపు కృష్ణంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అంధులకు చిన్నశ్రీను సోల్జర్స్ చేయూత


అంధులకు ఆర్థిక సాయం అందజేస్తున్న చిన్న శ్రీను సోల్జర్స్ సంస్థ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర

విజయనగరం: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా తమదైన శైలిలో సేవలందిస్తూ ప్రజామన్ననలు పొందుతున్న చిన్న శ్రీను సోల్జర్స్ సంస్థ అంధ విద్యార్థులకు తమవంతు చేయూతనందించింది. లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి సందర్భంగా నగరంలోని ధర్మపురిలో గల సిరి సహస్ర రైజింగ్ ప్యాలెస్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అంధ విద్యార్థులు, అంధుల యూత్ అసోసియేషన్‌లకు సిరిసహస్ర 15,000 రూపాయలు అందజేసింది. కార్యక్రమంలో ఆయా అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

యాదవులకు టికెట్ కేటాయించాలి..


సమావేశంలో పాల్గొన్న యాదవ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

విజయనగరం: జిల్లాలోని విజయనగరం ఎమ్మెల్యే టికెట్‌ను అన్ని రాజకీయ పార్టీలు యాదవులకు కేటాయించాలని యాదవ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు సాయి, గణేష్‌లు డిమాండ్ చేశారు. నగరంలోని ఓ ప్రైవేటహోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, జిల్లాలో 2.50 లక్షల మంది యాదవులు ఓటర్లుగా ఉన్నారన్నారు. రాజకీయపరంగా అత్యంత కీలకపాత్ర పోషిస్తున్న యాదవులకు తగిన గుర్తింపు లభించడం లేదన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించడం ద్వారా రాజ్యాధికారాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యాదవ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

వాడవాడలా సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి వచ్చింది తుమ్మెదా అంటూ భోగి మంట చుట్టూ తిరుగుతున్న విద్యార్థులు

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేసి దాని చుట్టూ విద్యార్థులు పాటలు పాడుతూ సందడి చేశారు. అలాగే రంగోలి పోటీలు, పిండి వంటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు హరిదాసు వేషధారణలు, సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, పాఠశాల కమిటీ చైర్మన్ ముద్దాడ రాము, ఎంఈఓలు వెంకటరమణ, రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, తదితరులు పాల్గొని చిన్నారులపై భోగి పండ్లు పోశారు.

పాఠశాలల్లో..

నెల్లిమర్ల రూరల్: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సంప్రదాయ వేషధారణలతో ఆకట్టుకున్నారు. పాఠశాలల ఆవరణలో రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే పిండివంటల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. తంగుడుబిల్లి, రామతీర్థం, కొండవెలగాడ, బొప్పడాం, అలుగోలు ఉన్నత పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు జరిగాయి. కార్యక్రమంలో తంగుడుబిల్లి సర్పంచ్ పిన్నింటి చిన అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కొంగవానిపాలెంలో..

భోగాపురం: మండలంలోని కొంగవానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంట వేసి, రంగవల్లులతో పాఠశాల అవరణను అందంగా తీర్చిదిద్దారు.


నెల్లిమర్ల రూరల్ : భోగిమంట వెలిగిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులు హరిదాసు, బుడబుక్కలవాడు, కొమ్మదాసరి వేషధారణతో సందడి చేశారు. విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలతో తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా సంక్రాంతి వైభవాన్ని చాటిచెప్పారు. భావితరాలకు మన సంప్రదాయ విలువలను తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తుంటామని ఉపాధ్యాయులు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం. రాజేశ్వరి, ఉపాధ్యాయులు ఆళ్ల వెంకటేష్, పబ్బిరెండి శివప్రసాద్, మిన్నారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగరం: జిల్లా కేంద్రంలోని కోటలో గల మహరాజా హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు జరిగాయి. భోగి మంట వేసి విద్యార్థులు సందడి చేశారు. సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థులు సందడి చేశారు.

విద్యాలయాల్లో..

విజయనగరం అర్బన్: నగరంలోని వివిధ యాజమాన్యాల విద్యాలయాల్లో సంక్రాంతి వేడుకలు


భోగాపురం: కొంగవానిపాలెం మండల పరిషత్ పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


విజయనగరం అర్బన్: ఫోర్ట్ సిటీ స్కూళ్లలో సంక్రాంతి సంబరాల నృత్యాంజలి


విజయనగరం అర్బన్: గురజాడ పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సందడి

ముందుగానే నిర్వహించారు. జంగమదేవర, డోలు–సన్నాయి, గంగిరెద్దు, హరిదాసు వేషధారణలతో పాఠశాలల్లో పండగ శోభ సంతరించుకుంది. ఇందులో భాగంగా భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను తెలియజేస్తూ, ఆ రోజుల్లో పాటించే పద్ధతులపై అవగాహన కల్పించారు. నగరంలోని ఫోర్ట్ సిటీ స్కూల్, గురజాడ పబ్లిక్ స్కూల్, ఎస్‌వీఎన్‌లోని నారాయణ, తదితర పాఠశాలల్లో సంబరాలు జరిగాయి.

సామాజిక తనిఖీలో వెలుగుచూసిన అవకతవకలు

- పూసపాటిరేగ, రెల్లివలస ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్


మాట్లాడుతున్న డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి, తదితరులు

పూసపాటిరేగ: ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో అవకతవకలు వెలుగుచూశాయి. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 2022–23 సంవత్సరానికి సంబంధించి 1623 పనులకు గాను రూ. 2.37 కోట్లు ఖర్చు చేయడంపై డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల చెరువు పనులలో అవకతవకలు జరిగినట్లు నిర్ధారించి బాధ్యులకు అపరాధ రుసుం విధించారు. పూసపాటిరేగ ఫీల్డ్ అసిస్టెంట్ కె. అప్పలనాయుడు బినామీల పేరిట మస్తర్లు వేసి నిధులు స్వాహా చేయడంతో విధుల నుంచి సస్పెండ్ చేశారు. అలాగే రెల్లివలస ఫీల్డ్ అసిస్టెంట్ త్రినాథరావు పలు అవకతవకలు పాల్పడినట్లు గుర్తించారు. చనిపోయిన వ్యక్తుల పేరిట మస్తర్లు వేసి నిధులు డ్రా చేసినట్లు గుర్తించడంతో అతడ్ని కూడా సస్పెండ్ చేశారు. కుమిలి గ్రామానికి సంబంధించి హౌసింగ్ స్కీమ్‌లో అధికంగా మస్తర్లు వేయడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను మందలించారు. చల్లవానితోటతో పాటు పలు గ్రామాలలో అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన మొక్కలు చనిపోయినా నిర్వహణ నిధులు డ్రా చేసినట్లు గుర్తించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. రాధిక, ఉపాధి హామీ పథకం ఏపీడీ జనార్దనరావు, ఉపాధి హామీ పథకం విజిలెన్స్ అధికారి వెంకటనాయుడు, ఎస్‌ఆర్‌పీ అచ్యుతరావు, ఏపీఓ రత్నమాల, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, ఎడ్ల రామకృష్ణ, తాడిశెట్టి బాబు, తదితరులు పాల్గొన్నారు.

మోహన్ మాస్టారు సేవలు చిరస్మరణీయం


సత్కారం అందుకున్న నరసింహం ఫౌండేషన్ ప్రతినిధులు

విజయనగరం: మోహన్ మాస్టారు సాహితీ రంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని వాకర్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ కొత్తిలి ఎర్నాయుడు అన్నారు. ఉడా కాలనీ గ్రంథాలయంలో మోహన్ మాస్టర్ 23వ వర్ధంతి సందర్భంగా సోమవారం పలు సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు వాకర్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ ఎర్రినాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నరసింహం ఫౌండేషన్ స్థాపించి మోహన్ మాస్టారు సాహిత్య, సామాజిక రంగాలకు సంబంధించి వివిధ సేవలు అందించారని గుర్తు చేశారు. పలువురు కవులు రచించిన రచనలకు ముద్రణ సౌకర్యం కల్పించడం, సాహితీ సంస్థల కార్యక్రమాల నిర్వహణకు ఆర్థికంగా తోడ్పాటు అందించడం, సుమారు 50 ఏళ్ల కిందట తంగుడుబిల్లి వంటి మారుమూల గ్రామాలలో వయోజనులకు రాత్రిపూట బడులు నిర్వహించి అక్షర జ్యోతులు వెలిగించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఆయన సేవలను నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నరసింహం ఫౌండేషన్ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఈశ్వరి మోహన్, రామానుజన్, గౌరీ ప్రసాద్, లలిత శ్రీనివాస్, సుభాషిణి, పుష్ప, పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి

- 16 మంది కార్మికుల అరెస్టు ..విడుదల.

విజయనగరం ఫూల్‌బాగ్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. 1వ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. వెంకటరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ అశోక్ పర్యవేక్షణలో పోలీసులు 16 మంది మున్సిపల్ కార్మికులను అరెస్టు చేశారు. ఈ అరెస్టులను సీఐటీయూ జిల్లా నాయకులు శంకరరావు, జగన్‌మోహన్ రావు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మికులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్మికుల పోరాటానికి వివిధ సంఘాల నాయకులు టీవీ రమణ, బి. పైడిరాజు, కె.త్రినాథ్ మద్దతు ప్రకటించారు.

మైనింగ్ అనుమతులు రెన్యువల్ చేయాలి

- కలెక్టరేట్ వద్ద విశాఖ ఉక్కు కార్మికుల ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

విజయనగరం ఫూల్‌బాగ్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ఇసుక, మాంగనీస్ ఓర్ తవ్వకాల అనుమతులను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉక్కు కార్మికులు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. కమిటీ నాయకులు, కార్మికులు వందలాది కార్లలో జిల్లాకు చేరుకోగా.. వీరికి విజయనగరం జిల్లాకు చెందిన సీఐటీయూ, ఇతర ట్రేడ్ యూనియన్ నాయకులు స్వాగతం పలికారు. సంతకాల వంతెన, ఆర్‌అండ్‌బీ జంక్షన్ మీదుగా కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నా చేపట్టారు. ధర్నా అనంతరం డీఆర్‌ఓ అనిత, మైన్స్ ఎ.డిలకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ పరిరక్షణ సంఘం కమిటీ చైర్మన్ స్ డి.ఆదినారాయణ, కో కన్వీనర్ అయోధ్యరామ్, రామస్వామి, వైటీ దాస్, ప్రసాద్, ఎ్.రామచంద్రరావు, రామేశ్వరరావు, కోటేశ్వరరావు, మోహనరావు, సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు యూఎస్ రవికుమార్, రెడ్డి శంకరరావు, కె.త్రినాథ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, తదితరులు పాల్గొన్నారు.


85 మద్యం బాటిళ్లు స్వాధీనం..

భోగాపురం: మండలంలోని కొండ్రాజుపాలెం కూడలి వద్ద ఎస్సై కృష్ణమూర్తి సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో తోటపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై అక్రమంగా మద్యం తరలిస్తున్న సూర్ని సన్యాసి, ఎరుపల్లి సన్యాసి అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద 85 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు

14న యువతకు సన్మానం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడలో ఈ నెల 14న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కొలువులు సాధించిన యువతను ఘనంగా సన్మానించనున్నామని కేవీడీ ఎంప్లాయీస్ సంఘ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భోగి, సంక్రాంతి పండగను పురస్కరించుకొని యువతకు సన్మానం చేస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన వారితో పాటు క్రీడలు, చదువులో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఉంటుందన్నారు.

రైస్ మిల్లు వద్ద రైతుల ఆందోళన


రామలక్ష్మణ మిల్లు వద్ద మాట్లాడుతున్న రైతులు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని కేఎల్.పురం రామలక్ష్మణ రైస్ మిల్లు వద్ద గంట్యాడ మండలంలోని పెదవేమలి గ్రామానికి చెందిన రైతులు సిరపురపు సన్యాసయ్య, దేముడు సోమవారం రాత్రి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం బస్తాకు 80 కేజీలు తీసుకోవాల్సి ఉండగా 84 కేజీలు తీసుకున్నారని ఆరోపిస్తూ ధర్నాకు దిగారు. 80 కేజీలు కదా బస్తాకు తీసుకోవాలని అడిగితే మేము ఇంతే తీసుకుంటాం దిక్కున్న చోట చెప్పుకో అంటూ సమాధానం చెప్పారని రైతులు వాపోయారు. 84 కేజీలు చొప్పున ఇస్తేనే ధాన్యం తీసుకుంటామని చెప్పడంతో చేసేది లేక ఇవ్వాల్సి వచ్చిందని చెప్పారు. సీఎస్‌డీటీకి చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

రాజాం: మండలంలోని పొగిరి గ్రామంలో బగ్గు ఉదయభాస్కర్‌నాయుడు ఇటీవల మృతి చెందగా, ఆయన భార్య ఉషకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల ఆర్థికసాయం సోమవారం అందజేశారు. మిగిలిన నగదును ఆమె బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని సర్పంచ్ పొగిరి కృష్ణవేణి, పొగిరి లెనిన్ తెలిపారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి

- ఎంపీపీ అప్పలనాయుడు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. విజయనగరం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు ఆలస్యంగా హాజరుకావడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశాల్లో ప్రజా సమస్యలను ప్రస్తావించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయం, విద్యుత్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలపై సమీక్ష నిర్వహించగా, పలువురు ప్రజాప్రతినిధులు విద్యుత్, ధాన్యం తరలింపు, రీ సర్వేపై పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వీటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ తెలిపారు.

రాజకీయాల ప్రస్తావన..

ప్రజా సమస్యలను పరిష్కారానికి వేదికలో టీడీపీ ప్రజాప్రతినిధులు రాజకీయాల ప్రస్తావన తీసుకువచ్చేందుకు ప్రయత్నించగా ఎంపీపీ వాటిని తిప్పికొట్టారు. కేవలం సమస్యల ప్రస్తావన తీసుకువచ్చి ప్రజలకు మేలు చేయాలే గాని, సభను పక్కదారి పట్టేలా రాజకీయాల ప్రస్తావన తీసుకురావద్దని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ నడిపేన శోభార్గవి, వైస్ ఎంపీపీ నారాయణ, ఎంపీడీఓ గంటా వెంకటరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు మద్దతు పలకాలి

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: నగరంలోని 25వ డివిజన్ సున్నంబట్టి వీధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని తెలియజేస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డికి మద్దతు పలికితే రాష్ట్రం మరో ఐదేళ్లు సుభిక్షంగా ఉంటుందన్నారు. ఇప్పటికే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందడంతో ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు బలివాడ కాశీపతిరావు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ, తమ డివిజన్‌లో గడప గడపకు.. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగుతోందన్నారు. డివిజన్‌లోని ఎన్నో సమస్యలను పరిష్కరించిన ఘనత ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామికి దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యడ్ల రాజేష్, పైడితల్లమ్మ దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మెంబర్ బలివాడ పార్వతి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో ప్రయోజనాలు

- వైకేపీ ఏపీఎం విజయలక్ష్మి


కూరగాయల స్టాల్ వద్ద ఏపీఎం విజయలక్ష్మి, తదితరులు

డెంకాడ: ప్రకృతి పద్ధతుల్లో పంటలు సాగు చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం విజయలక్ష్మి అన్నారు. మండల వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయం ఆవరణలో ఏపీసీఎన్‌ఎఫ్ వారి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల అమ్మకం స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రసాయన ఎరువుల వినియోగంతో సాగు చేసిన పంటల వల్ల అనేక అనర్థాలుంటాయన్నారు. ప్రకృతి పద్ధతుల్లో సాగు చేయడం వల్ల నాణ్యమైన దిగుబడులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఏపీసీఎన్‌ఎఫ్ ఎం.టి ఈశ్వరమ్మ, సీసీలు సూరిబాబు, నాని, సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి బి.సుజాత, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా ధీరా ఫౌండేషన్

- ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొత్స సందీప్


గ్రూప్స్ అభ్యర్థులకు అవసరమయ్యే స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న డాక్టర్ బొత్స సందీప్

విజయనగరం: ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు ధీరా ఫౌండేషన్ అండగా నిలుస్తుందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొత్స సందీప్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడే మెటీరియల్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు నాణ్యమైన మెటీరియల్ అందించాలనే ఉద్దేశంతో పది సబ్జెక్టుల్లో స్టడీ మెటీరియల్‌ను తయారు చేయించి అందించామని చెప్పారు. జిల్లాలోని 41 గ్రంథాలయాలకు ఈ పుస్తకాలను అందజేయాలని కోరారు. అభ్యర్థుల కోరిక మేరకు ఫిబ్రవరి నెలలో రెండు సార్లు మాక్ టెస్టులను నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లక్ష్మి, ధీర ఫౌండేషన్ సభ్యులు అప్పలరాజు, చక్రధర్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపు చారిత్రాత్మకం


చంద్రంపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి వెంకటరమణ, తదితరులు


అందుకున్న రూ.3 వేల నగదును చూపిస్తున్న లబ్ధిదారులు

నెల్లిమర్ల రూరల్: సామాజిక పింఛన్ల పెంపు చారిత్రాత్మకమని వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి కర్రోతు వెంకటరమణ అన్నారు. మండలంలోని చంద్రంపేట, పూతికపేట, కొండగుంపాం గ్రామాల్లో పెంచిన రూ.3 వేల పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో అత్యధికంగా పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పతివాడ అప్పన్న, నాయకులు వాల్లె అప్పలనాయుడు, రాజినాయుడు, లెంక గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌బాబు చల్లగుండాలి..

నెల్లిమర్ల రూరల్: పింఛన్ల పెంపుతో అవ్వాతాతల మోముల్లో చిరునవ్వులు వికసించాయి. సోమవారం మండల వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కొనసాగింది. మండలంలోని తరిమిలో పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అందుకున్న నగదు చూపిస్తూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మా పెద్ద కొడుకంటూ మురిసిపోయారు. దేవుడి దీవెనలతో పది కాలాల పాటు జగన్‌బాబు చల్లగా ఉండాలని ఆశీర్వదించారు.